డబ్ల్యూఈపీఎల్ లీగ్‌కు

పాలమూరు క్రీడాకారుడు గణేష్

● ఇంగ్లాండ్ చెల్టెన్‌హామ్‌లోని హెచ్ఆర్‌సీసీ క్లబ్‌కు 6 నెలల పాటు 20 మ్యాచ్‌లు ఆడేందుకు ఒప్పందం

● అభినందించిన ప్రభుత్వ క్రీడల సలహాదారుడు జితేందర్‌రెడ్డి

6

స్కానింగ్ కష్టాలు



అల్ట్రా సౌండ్ స్కానింగ్ టోకెన్ల కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి వద్ద లైన్లో నిల్చున్న రోగుల సహాయకులు

● రోజుకు 40 మందికే టోకెన్లు

● వైద్యుల కొరత కారణంగా ఇబ్బందులు

● ఆలస్యమైతే మరుసటి రోజు వరకు ఎదురు చూపులు

● మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో ఇదీ పరిస్థితి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యుల కొరత కారణంగా రోజూ 40 మందికే స్కానింగ్ చేస్తున్నారు. దాంతో టోకెన్లు తీసుకునేందుకు తెల్లవారుజాము నుంచే క్యూలో ఉండాల్సి వస్తోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాటు ఆస్పత్రిలో జాయిన్ అయిన రోగులకు వైద్యులు వచ్చి అవసరమైతే స్కానింగ్ రాసేందుకు ఆలస్యం అవుతుండటంతో మరుసటి రోజు వరకు ఎదురు చూడాల్సి వస్తోంది.

ఒక్కొక్కరి నుంచి రూ.30 వసూలు

అసలే ఎండా కాలం కావడంతో కిడ్నీల్లో రాళ్లు ఉన్న బాధితులు రోజు రోజుకు పెరుగుతుంటారు. కిడ్నీ పనితీరు, అందులో రాళ్లు ఉన్నాయా? లేవా?, ఉంటే ఏ పరిమాణంలో ఉన్నాయి? అని తెలుసుకునేందుకు, కడుపు నొప్పి నిర్ధారణ చేయడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసి నిర్ధారణ చేస్తారు. అయితే మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో యూఎస్జీ స్కానింగ్ రోజూ కేవలం 40 మందికే తీస్తున్నారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులు హెచ్‌డీఎస్ లో జమ చేస్తారు.

ఎందుకీ కష్టాలు..

ఆస్పత్రిలో రేడియాలజిస్టు డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఆ విభాగంలో ఒక హెచ్‌వోడీ, మరో ఇద్దరు కాంట్రాక్టు డాక్టర్లు ఉన్నారు. అందులో ఒకరు మహిళలకు స్కానింగ్ చేయడానికి వెళ్తుండగా, మరొకరు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో ఉంటున్నారు. హెచ్‌వోడీ డాక్టర్ సీటీ స్కానింగ్‌లో ఉంటున్నారు. దీంతో ఉన్నది ఒక్కరే కావడంతో భారమంతా అతనిపైనే పడుతోంది. దీంతో 40 మందికే టోకెన్లు ఇస్తున్నామని ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి గతంలో ఇద్దరు రేడియాలజీ డాక్టర్లు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తుండేవారు. కాని వారి కాలపరిమితి అయిపోవడంతో వారు వెళ్లిపోయారు. రేడియాలజీ విభాగానికి ఎన్ని సార్లు నోటిఫికేషన్ వేసినా ఒక్క రేడియాలజిస్టు కూడా రావడం లేదని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నారు.

తెల్లవారుజాము నుంచే క్యూ...

యూఎస్జీ స్కానింగ్ టోకెన్ తీసుకోవాలంటే తెల్లవారుజామున 5 గంటల నుంచి 8 గంటల మధ్యలో ఆస్పత్రికి రావాలి. వరుసలో నిలబడి టోకెన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ టోకెన్ కేవలం 40 మందికే ఇస్తుండటంతో మిగతా 50 నుంచి 60 మంది వెనుతిరిగి వెళ్తున్నారు. దీంతో గత్యంతరం లేక బాధితులు ఉదయం 5 గంటల నుంచే ఆస్పత్రి వద్ద క్యూలో నిలబడుతున్నారు. అయితే అత్యవసర పరిస్థితిలో ఉన్న రోగులు టోకెన్లు దొరకకపోతే ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇదిలా ఉండగా అడ్మిట్ అయిన రోగులకు డాక్టర్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రౌండ్స్ వేస్తున్నారు. దాంతో స్కానింగ్ ఆలస్యంగా రాస్తున్నారు. అప్పటికే టోకెన్లు ఇవ్వడం అయిపోతుండటంతో వారు స్కానింగ్ తీసుకోలేక పోతున్నారు. మరుసటి రోజు వరకు ఆగాల్సి వస్తుంది. వ్యాధి నిర్ధారణ అయితేనే ట్రీట్‌మెంట్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. కానీ స్కానింగ్ ఆలస్యం అవుతుండడంతో చాలా మంది రోగులకు వైద్యం అందడం లేదు. మరి కొందరు స్కానింగ్ లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు.



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి



తెలంగాణ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి తదితరులు

మహనీయుల ఆశయ సాధనకు కృషి

● విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థానం

● కలెక్టర్ విజయేందిర బోయి

● ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

● కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రూ.2.5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాల పంపిణీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దళితులు, మహిళల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం నిరంతరం పోరాడిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటామని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వంటి ఎందరో మహనీయుల పోరాటం, కృషి ఫలాలను మనం అనుభవిస్తున్నామని చెప్పారు. ఆనాడు అంటరానితనం బలంగా ఉన్న సామాజిక పరిస్థితుల మధ్య బిహార్ రాష్ట్రంలో మారుమూల గ్రామంలో జన్మించి, అత్యున్నత పదవులను అలంకరించారని అన్నారు. అధిక కాలం కేంద్ర మంత్రిగా పని చేసిన గొప్ప నాయకుడని, ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా పని చేశారని గుర్తు చేశారు. 1971లో భారత్, పాక్ యుద్ధ సమయంలో ఉన్న ఆయన బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని అన్నారు. 1974లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు హరిత విప్లవాన్ని ప్రారంభించి, ఆహార ధాన్యాల కొరతకు పరిష్కారం చూపించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలను రూపొందించాయన్నారు. వాటిని అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ సమ సమాజ నిర్మాణానికి కృషి చేసిన సామాజిక విప్లవకారుడని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శి వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, జాతీయ మాల మహానాడు నాయకులు మంత్రి నరసింహయ్య, తెలంగాణ దక్షిణ ప్రాంత ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లెపోగు శ్రీనివాస్, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు బోయపల్లి నర్సింహులు, తెలంగాణ దళిత క్రిస్టియన్ దండోరా నాయకులు శామ్యూల్, జాతీయ మహిళ ఐక్య వేదిక అధ్యక్షుడు కంచిమి లక్ష్మణ్, కేవీపీఎస్ నాయకులు కుర్మయ్య, ఎంఈఎఫ్ నాయకులు యాదయ్య, షెడ్యూల్ కులాల సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సుదర్శన్ పాల్గొన్నారు అనంతరం కులాంతర వివాహాలు చేసుకున్న ఆరుగురికి రూ.2.5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ప్రతాలను అందించారు.

నివాళి అర్పించిన కలెక్టర్, ఎస్పీ

తెలంగాణ చౌరస్తాలోని బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి పూల మాల వేసి, నివాళి అర్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ, ఉద్యోగ, కుల సంఘాల నాయకులు పూల మాలలు వేశారు.



జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డలో కాలనీవాసులతో మాట్లాడుతున్న జడ్చర్ల సీఐ కమలాకర్

అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు

● జడ్చర్ల సీఐ కమలాకర్

● నిమ్మబావిగడ్డలో కమ్యూనిటీ కాంటాక్ట్

జడ్చర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని జడ్చర్ల సీఐ కమలాకర్ చెప్పారు. కాలనీల్లోకి వచ్చే వాళ్లపై దృష్టి పెట్టాలని, అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లుగా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా శనివారం జడ్చర్ల మునిసిపాలిటీలోని నిమ్మబావిగడ్డ ప్రాంతం, మార్క్‌ఫెడ్ గోదాముల సమీపంలోని కాలనీలలో శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడుతూ కాలనీలో తిరుగుతూ వస్తువులు కొంటామని, అమ్ముతామంటూ వచ్చేవాళ్లపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. ముఖ్యంగా గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, ఆశ్రయం ఇవ్వకూడదని సూచించారు. ఏదైనా అనుమానం ఉంటే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. విలేకరులతో మాట్లాడుతూ నిమ్మబావిగడ్డ ప్రాంతంలో సరైన పత్రాలు లేని 15 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశామని చెప్పారు. సరైన పత్రాలు చూపిస్తే అప్పజెప్తామన్నారు. ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 60 మంది సిబ్బంది కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నాగార్జున్‌గౌడ్, ఎస్ఐలు జయప్రసాద్, మల్లేష్, చంద్రమోహన్, ఖాదర్‌లతో పాటు ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

లబ్ధిదారు ఇంట్లో భోజనం

● దమగ్నాపూర్‌లో సన్న బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

● బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డితో కలిసి సహపంక్తి భోజనం



దమగ్నాపూర్ గ్రామంలో సన్న బియ్యంతో వండిన భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్, బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకంలో భాగంగా శనివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బియ్యం పంపిణీ చేశారు. బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డితో కలిసి బియ్యం అందజేసిన ఎమ్మెల్యే బోయ బొజ్జమ్మ నివాసంలో పంపిణీ చేసిన సన్న బియ్యాన్ని వండించారు. అక్కడే సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగదభిరాంరెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, వట్టెం శివకుమార్, బాలకిష్టారెడ్డి, ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, వజీర్‌బాబు, రంజిత్‌రెడ్డి, వెంకటేష్, మహేశ్వర్ పాల్గొన్నారు.

లోపలి పేజీల్లో..



సొరంగంలో నిషేధిత ప్రాంతం పరిశీలన

● ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

● శిథిలాల తొలగింపులో బయట పడుతున్న సెగ్మెంట్ బ్లాకులు

6



కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

● టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం

7

సీతారాముల కల్యాణం చూతము రారండి

● నేడు సిరసనగండ్లలో సీతారాముల వివాహం



విద్యుత్ వెలుగుల్లో సీతారామచంద్ర స్వామి దేవాలయం

చారకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) శ్రీరామ నవమి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరసనగండ్ల సీతారామచంద్రస్వామిదేవాలయంలో ఆదివారం స్వామివారి మహా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణానికి ఉమ్మడి పాలమూరు జిల్లా, రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి స్వామివారి కల్యాణానికి భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ చైర్మన్, ఈవో ఆధ్వర్యంలో చలువ పందిళ్లు, కూలర్లు, తాగునీటి వసతి కల్పించనున్నారు. ఆలయాన్ని మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రభుత్వ లాంచనాలతో పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించనున్నారు. మంత్రితో పాటు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరుకానున్నారు. భక్తుల రవాణా సౌకర్యార్థం కల్వకుర్తి, దేవరకొండ,

(మిగతా 6లో..)

9 నుంచి ఎస్ఏ 2 పరీక్షలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖ

● నారాయణపేటలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు 82,932 మంది విద్యార్థులు



నారాయణపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

నారాయణపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీ నుంచి ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఎస్ఏ 2(సంగ్రహణాత్మక మూల్యాంకనం) పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు 82,932 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో బాలురు 42,414 మంది ఉండగా, బాలికలు 40,518 మంది ఉన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీఈవో గోవిందరాజులు ఆధ్వర్యంలో పరీక్షల విభాగం జిల్లా ఇన్‌చార్జి అధికారి రాజ్‌కుమార్ నేతృత్వంలో చర్యలు తీసుకుంటున్నారు. మండలాల వారీగా పరీక్ష పత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి పదకొండున్నర గంటల వరకు పరీక్షలు ఉంటాయి. 8వ తరగతికి ఉదయం 9 నుంచి 11:45 వరకు, 9వ తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు ముగిసిన అనంతరం మార్కులు, హాజరు వివరాలు ఐఎస్‌ఏఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ నెల 23న తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులు వివరించనున్నారు.

ఖాళీగా ఉంటే కబ్జా..!

- రూ.కోటి విలువ చేసే స్థలం కొట్టేసిన రియల్ ఎస్టేట్ ఏజెంట్
- భార్య పేరుతో రిజిస్ట్రేషన్
- పాత హౌసింగ్ బోర్డు స్థలాన్ని ఆక్రమించిన దళారులు
- మునిసిపాలిటీ కార్యాలయం నుంచి ఫేక్ ఇంటినెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘనులు
- మునిసిపాలిటీలో చక్రం తిప్పి రూ. 8 లక్షలు వసూలు చేసిన ఓ యువ నాయకుడు?



గద్వాల క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎక్కడైనా ఖాళీ జాగా కనపడితే దళారులు కబ్జా చేసేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో ఫేక్ ఇంటినెంబర్లను సృష్టిస్తూ రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నారు. తర్వాత వాటిని వారి భార్యపేరిట, బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఎవరైనా అమాయకులు దొరికితే వారికి అమ్మి పబ్బం గడుపుకుంటున్నారు. ఈ సంఘటనలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. అయితే అధికారులు ఇవేమి చూడకుండా ముడుపులు ముడితే చాలు అన్న రీతిన వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్ కార్యాలయం అయినా, తేరు మైదానం, బస్టాండ్‌లకు సైతం ఫేక్ ఇంటి నంబర్లు సృష్టించడం ఇక్కడ వెన్నతో పెట్టిన విద్యలా తయారైంది. ఇంటినంబర్లు ఉంటే ఇక రిజిస్ట్రేషన్ చేయడం సులువు అన్నట్లుగా తయారైందీ వ్యవస్థ. వీటిని పట్టించుకున్న వారే కరువయ్యారన్న విమర్శలు లేక పోలేదు.

పాత హౌసింగ్ బోర్డు కాలనీలో స్థలాన్ని ఆక్రమించిన దళారులు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డులో గత కొన్ని సంవత్సరాల క్రితం పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో హౌసింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఇళ్లను కట్టి లబ్ధిదారులకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే అక్కడ ఇల్లు కట్టగా పోగా 72 గజాల రోడ్డువైపు ఉన్న స్థలం అలాగే మిగిలిపోయింది. అయితే అధికారులు మారుతుండటంతో ఈ స్థలాన్ని ఎవరూ గమనించలేదు. ఇదే అదునుగా భావించిన ఓ రియల్ ఎస్టేట్ ఏజెంట్ ఆ స్థలంలో ఓ గుడిసెను వేశాడు. అలా కొన్ని సంవత్సరాలు గడిచాక ఆ గుడిసె స్థలంలో మునిసిపాలిటీ నుంచి ఇంటినంబర్ వచ్చేలా చేసుకున్నాడు. తీరా ఇంటినంబరు 1-3-కే/101/ఏ/1 వచ్చాక వెంటనే తన భార్యపేరుతో రిజిస్ట్రేషన్‌ను 2023, ఆగస్టు 30వ తేదీన చేయించుకున్నాడు. ఇప్పుడు రూ. కోటి విలువ చేసే ఈ స్థలాన్ని అమ్మకానికి ఉంచాడు. ఇలా ఖాళీ స్థలాలు ఎక్కడ కనపడితే అక్కడ దళారులు ఆక్రమిస్తున్న సందర్భాలు జిల్లాలో కొక్కొల్లలుగా చెప్పుకోవచ్చు.

ఫేక్ ఇంటినెంబర్ ఇవ్వడంలో ఓ యువ నాయకుడి కీలకపాత్ర

వాస్తవానికి హౌసింగ్ బోర్డుకు సంబంధించిన స్థలం మునిసిపాలిటీ వారికి సంబంధం ఉండదు. సుమారు 100 గజాలు ఉంటే ఆ స్థలాన్ని హౌసింగ్‌బోర్డు అధికారులు పేపర్ ప్రకటన ఇచ్చి వేయాల్సి ఉంటుంది. కానీ 72 గజాలు ఉన్న ఈ స్థలాన్ని ఓ యువ నాయకుడు ఓ మాజీ ప్రజాప్రతినిధి అండదండలతో ఇట్టే మునిసిపాలిటిలో ఫేక్ ఇంటినంబర్ ఇప్పించినట్లు తెలుస్తున్నది. ఇందుకు ఆ యువనాయకుడు తీసుకున్న రుసుం అక్షరాల రూ. 8లక్షలు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఫేక్ ఇంటినెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆ రియల్ ఏజెంట్ ఇతరులకు అమ్మేందుకు ఇంటినిర్మాణం అనుమతులు తీసుకునేందుకు మునిసి పాలిటీకి వెళ్లగా ఓ మాజీ ప్రజాప్రతినిధి అడ్డుకోవడంతో విషయం మొత్తం బయటకు పొక్కింది. అయితే ఈ యువనాయకుడు వెనుక ఓ బలమైన మాజీ ప్రజాప్రతినిధి వల్లే ఖాళీ స్థలానికి దర్జాగా ఇంటి నంబర్ వచ్చినట్లు జిల్లా కేంద్రంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధికారులు ఏమి చేస్తున్నారో...?

ఇలా ఖాళీ స్థలాలు కబ్జా చేసి దొంగ ఇంటినెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదో అర్థం కాని పరిస్థితి ఎదురౌతున్నది. అయితే ఇందులో ఎవరి వాటా ఎంతెంతో తెలియాల్సి ఉంది. ఖాళీ స్థలంలో గుడిసె వేసి ఏకంగా ఫేక్ ఇంటినంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకొని రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు మునిసిపాలిటీపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

గుడిసె, ఖాళీ స్థలాలపై ఇంటి నెంబరు ఇవ్వరాదు

గుడిసెకు సంబంధించి ఇంటి నెంబరు ఇవ్వడంపై మునిసిపల్ కమిషనర్ దశరథ్‌ను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఖాళీ స్థలాలకు, గుడిసెలకు ఇంటినంబర్లు ఇవ్వకూడదన్నారు. అయితే ఏ అధికారి ఈ గుడిసెకు ఇంటినంబర్ ఇచ్చాడో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గుడిసె వేసిన వారు ఇంటినంబర్‌కు అప్లై చేసినప్పుడు తప్పుడు ధ్రువపత్రాలు అయినా, లేదా వేరే ఇంటినంబర్‌ను చూపించి మునిసిపల్ అధికారులను మోసం చేసి ఉండవచ్చన్నారు. ఏది ఏమైనా ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే హౌసింగ్ అధికారులు కూడా ఈ విషయంపై విచారణ చేస్తామని ఆంధ్రజ్యోతితో తెలిపారు.

సీతారాముల కల్యాణం చూతమురారండి

- నేడు సిరసనగండ్లలో సీతారాముల మహాకల్యాణోత్సవం

(5వ పేజీ తరువాయి..)

ఇబ్రహీంపట్నం, అచ్చంపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో స్వర్గం అంజనేయులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేస్తున్నారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 17 మంది ఎస్ఐలతో పాటు 327 మంది పోలీస్ ఫోర్స్ బందోబస్తులో పాల్గొననున్నారు.

వైభవంగా సీతారాముల మాస కల్యాణం


భక్తులకు తాళిబొట్టును చూపిస్తున్న పూజారి లక్ష్మణశర్మ

మండలంలోని సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణం, పతాకావిష్కరణ, అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు బ్యాండు మేళాల నడుమ సీతారామచంద్రస్వామి విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల మాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. కల్యాణోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, మాజీ ఎంపీ రాములు దంపతులు హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ చైర్మన్ కేవీఎన్ రెడ్డి, మాజీ ఎంపీ దంపతులను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ డేరం మల్లికార్జున శర్మ, తహసీల్దార్ సునీత దంపతులు, కల్వకుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్ రావు, అచ్చంపేట, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

శివకుమార్‌ను అభినందించిన కలెక్టర్


శివకుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్‌కు భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ నేషనల్ యూత్ అవార్డును ప్రకటించడం పట్ల కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం శివకుమార్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివకుమార్‌కు ఈ అవార్డు రావడం చాలా గొప్ప విషయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు రావడంతో జిల్లాకు మంచి పేరు సాధించాడన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేసి యువతకు సామాజిక అభివృద్ధికి ముందడుగు వేయాలని సూచించారు.

విగ్రహాలకు తొడుగుల అందజేత


విగ్రహాల తొడుగులతో దాతలు గుడిపల్లి మల్లయ్య, సత్యమ్మ దంపతులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కూచూర్ గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, పేరుమళ్ల అంజనేయస్వామి దంపతులకు శనివారం గ్రామానికి చెందిన గుడిపల్లి మల్లయ్య, సత్యమ్మ దంపతులు రూ.1,25,000 విలువ చేసే విగ్రహ తొడుగులు, భజన సామగ్రి గ్రామస్థులు భజన మండలి సభ్యులకు అందజేశారు. చిన్నయ్య, రాములు, స్వామి, బాలయ్య, నర్సింహులు, అంజనేయులు, చెన్నయ్య పాల్గొన్నారు.

లక్ష రూపాయలు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు లక్ష రూపాయల స్వాహా చేసిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు వచ్చినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన బాషమోని భాస్కర్, శుక్రవారం హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వస్తుండగా బస్సులో ఫోన్ తప్పిపోయింది. ఆ ఫోన్ ద్వారా సైబర్ నేరగాళ్లు లక్ష రూపాయలు ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసుకోవడంతో బాధితుడు నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

ధాన్యం డబ్బులు ఇవ్వని వ్యక్తిపై కేసు నమోదు

బల్మూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు. వివరాల ప్రకారం.. గోదల్ గ్రామానికి చెందిన మాడుగుల తిరుపతయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన కొందరు రైతుల దగ్గర ధాన్యాన్ని ముందుండి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యాపారికి ధాన్యం ఇప్పించాడు. సదరు వ్యాపారి డబ్బులు ఆరు లక్షల 68వేల రూపాయలు ఇవ్వకపోవడంతో గ్రామానికి చెందిన రైతులు మాడుగుల, తిరుపతయ్యను మా డబ్బులు మాకు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో రైతులందరూ కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉండే వ్యాపారి శ్రీనివాస్ దగ్గరికి వారం రోజుల క్రితం వెళ్లి ప్రశ్నించగా తాను డబ్బులు ఇవ్వలేనని చేతులెత్తేశారు. దీంతో రైతులు తిరుపతయ్యను ఒత్తిడి చేయడంతో సదరు వ్యాపారిపై శనివారం పోలీస్ స్టేషన్‌లో తిరుపతయ్య ఫిర్యాదు చేయడంతో విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న అకాల వర్షాలు

- జిల్లా వాతావరణంలో అనూహ్య మార్పులు
- అన్నదాతలను అతలాకుతలం చేస్తున్న అకాల వర్షాలు
- ఈదురుగాలులతో పాటు పిడుగులు, వానలు
- చేతికి వచ్చిన వరి పంటలు.. భయం గుప్పిట్లో అన్నదాతలు

వనపర్తి అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వానలు.. చలికాలం తీవ్రమైన చలి.. వేసవికాలం మాడు పగిలే ఎండలు సర్వసాధారణమే. కానీ జిల్లాలో దీనికి భిన్నమైన వాతావరణం కనిపిస్తున్నది. ఈ ఏడాది వేసవి వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడంతో మండే వేసవిలో కూడా ఈదురుగాలులతో పాటు వానలు, పిడుగులు పడుతున్నాయి. అనూహ్యంగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలకు అపార నష్టం వాటిల్లుతుంది. గత ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలో మార్పులు చోటు చేసుకోవడంతో పాటు వాతావరణం చల్లబడింది. ఐదు రోజుల క్రితం వరకు జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జిల్లా వాతావరణం పూర్తిగా చల్లబడింది. అయితే అంతుచిక్కని వాతావరణంతో జిల్లా వాసులు అయోమయానికి గురవుతున్నారు. తీవ్రమైన ఎండకాలంలో వానకాలం పరిస్థితులు ఏమిటని సర్వత్రా చర్చించుకుంటున్నారు.

మండు వేసవిలో చల్లని వాతావరణం

ఏప్రిల్ మాసం అంటేనే ఎండలు మెండుగా ఉంటాయి. కానీ గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పాటు ఈదురు గాలులకు అక్కడక్కడ కురుస్తున్న అకాల వర్షాలకు వాతావరణం చల్లబడింది. గురువారం రాత్రి జిల్లాలోని పలు మండలాల్లో చిరు జల్లులతో కూడిన భారీ వర్షం కురిసింది.

చిన్నంబావి మండలంలో అత్యధికంగా 27.6 మి.మీ వర్షపాతం నమోదయిం ది. అదే విధంగా వీపనగండ్ల 19.2, పాన్‌గల్ 18.6, ఘణపూర్ 17.2 , కొత్తకోట 11.2, శ్రీరంగాపూర్ 8.4, రేవల్లి 7.2, పెద్దమందడి 6.4, పెబ్బేరు 4.4, గోపా లపేట 2.8, వనపర్తిలో 2.4 మి.మీ వర్షపాతం న మోదయింది. వాతావరణంలోని మార్పులతో ఏది ఏమైనా గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గి కొంతమేర వాతావరణం చల్లబడింది. ఎండల నుంచి జిల్లా ప్రజలు కాస్త ఉపశమనం పొందు తున్నారు.

294 ఎకరాల్లో పంట నష్టం

జిల్లా వ్యాప్తంగా గత ఐదు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి 294 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో 276 ఎకరాల్లో వరి, 17 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు.

ఇది కాకుండా చేతికి వచ్చిన వరి పంటతో పాటు మొక్కజొన్న కూడా అకాల వర్షానికి నేల కొరిగింది.

పంట చేతికి వచ్చిన సమయంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పాటు ఈదురుగాలులకు అకాల వర్షాలకు రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు మరో 10 రోజుల్లో వరి కోతలు కోయాల్సి ఉండగా ముందస్తుగానే వరి కోతలను ప్రారంభించారు.

సొరంగంలో నిషేధిత ప్రాంతం పరిశీలన

- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
- శిథిలాల తొలగింపులో బయట పడుతున్న సెగ్మెంట్ బ్లాకులు
- ఊపందుకున్న మట్టి తవ్వకాలు, ఊటనీటి తరలింపు


సొరంగంలో నిషేధిత ప్రాంతం వరకు రెస్క్యూ బృందంతో కలిసి వెళ్లి పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

దోమలపెంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటన జరిగి నేటికీ 44 రోజులు కావడం జరిగింది. శనివారం ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి రెస్క్యూ బృందాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సొరంగంలో చేపడుతున్న పనులు, చేయాల్సిన పనులపై చర్చించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల షిఫ్ట్‌లో రెస్క్యూ బృందాలు వారిలో కలిసి సొరంగంలోకి వెళ్లారు. అక్కడ కొనసాగుతున్న పనులనూ ప్రత్యక్షంగా పరిశీలించారు. సొరంగంలో టీబీఎం మిషన్ చిక్కుకున్న నిషేధిత ప్రాంతం గుర్తించిన ఇనుప కంచె వేసిన 43 మీటర్ల వరకు రెస్క్యూ బృందాల అధికారులతో కలిసి నిషేధిత ప్రాంతాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారితో మాట్లాడుతూ ప్రమాదం కళ్ల ఎదుట కన్పిస్తున్న ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొంటూ సొరంగంలో కూలీపడిన శిథిలాలను తవ్వుకుంటూ పనులు పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. ఇంతటి సహసోపేతంగా పనులు చేపడుతున్న వారిని ఆయన అభినందించారు. తాను సొరంగంలోకి వచ్చి స్వయంగా చూస్తే తప్పా ప్రమాద తీవ్రత తెలియలేదన్నారు. మరో ప్రమాదం జరుగ కుండా తగు చర్యలు తీసుకుంటూ పనులు కొనసాగించాలని రెస్క్యూ సిబ్బందికి సూచించారు. సమీక్షా సమావేశం కార్యక్రమంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఇరిగేషన్, జెపీ కంపెనీ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇక తవ్వాల్సింది.. మిగిలింది 100 మీటర్లే...

టన్నెల్ కూలిన శిథిలాలను తొలగించే ప్రాంతం వరకు సరైన గాలి, వెలుతురును ఏర్పాటు చేసుకుంటూ సహాయక బృందాలు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 13.768 కిలో మీటర్ల వరకు మాత్రమే ఎయిర్ డక్ట్‌ను మరో 25 మీటర్ల వరకు పొడిగించారు. శిథిలాలను తవ్వేకొద్దీ పెద్దపెద్ద బండరాళ్లతో పాటు, టన్నుల బరువున్న ఇనుప గడ్డర్లు బయట పడుతున్నాయి. వాటిని కత్తిరించుకుటూ లోకో ట్రైన్‌లో బయటకు తరలిస్తున్నారు. 153 మీటర్ల శిథిలాలు ఉండగా గడిచిన మూడు రోజుల్లో 50 మీటర్లకుపైగా శిథిలాలను రెస్క్యూ బృందాల వారు తొలగించారు. ఇక 100 మీటర్ల దూరాన్ని మరో 10 రోజుల్లో పూర్తిగా తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. రోజుకు మూడు షిఫ్ట్‌లో సహాయక చర్యలు చేపడుతున్నారు. ఒక్కో షిఫ్ట్‌కు 100 మంది రెస్క్యూ సిబ్బంది పాల్గొంటున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా రోజుకు 500 మంది వరకు సహాయ సహకారాలతో పనులు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.


పనులు జరిగే ప్రాంతానికి గాలి (ఎయిర్ డక్ట్) సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్న రెస్క్యూ బృందం

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బోరు మోటారు నడవడం లేదని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతుకు యత్నించిన ఊడుగుల రామకృష్ణ అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన బాధితుడు రామకృష్ణ కేఎల్ఐ కాలువలో మోటారు వేసి పంట పొలానికి నీటిని పారిస్తున్నాడు. శనివారం రాత్రి విద్యుత్ సరఫరా లేక మోటారు బంద్ కావడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో తెగిన వైర్‌ను సరిచేసేందుకు యత్నించాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై శరీరం కాలి తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు గుర్తించి వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ శివ, పైలెట్ జహంగీర్‌లు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

మే 7న హైందవ భక్తి కళా సమ్మేళనం

- అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ


కళా సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వామీజీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సంకీర్తన సంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరి లక్ష్యంతో మే 7వ తేదీన హైదరా బాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించనున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ తెలిపారు. శనివారం మన్యంకొండ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన భజన కళాబృందం గురువులు, ప్రతినిధుల హరినామ సంకీర్తనలో శంకరస్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తిరుమల తిరుపతి దేవాలయం మాదిరిగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో నిత్యం హరినామ సంకీర్తనలు జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేల సంఖ్యలో జానపద, భజన కళాబృందాలు, కళాకారులు ఉన్నారన్నారు. హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. భజన గురువులకు గుర్తింపు కార్డులు ఇచ్చి కళారంగాన్ని ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వాలు, దేవాదాయశాఖ ముందుకు రావాలని ఆయన కోరారు. మే 7న హైదరాబాద్‌లో నిర్వహించే హైందవ కళా సమ్మేళనంలో భజనపరులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళా సమ్మేళనం పోస్టర్‌ను స్వామీజీ ఆవిష్కరించారు. అలాగే, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలకు చెందిన కళాకారులు రెండు గంటల పాటు ఆలపించిన భక్తిపాటలు శ్రోతలను అలరించాయి. అనంతరం మన్యం కొండ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మధుసూదన్ చారి హరినామ సంకీర్తనలలో పాల్గొన్న భజన గురువులను ప్రత్యేకంగా అభినందించారు. మన్యంకొండలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భజన గురువులు పాల్గొని హనుమద్దాసుని సంకీర్తనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హిందు పర్‌ఫ్యూరాలిటీ అండ్ ఈ క్వాలిటీ ప్రతినిధి మల్లికా వల్లభ, జై భారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూఈపీఎల్ లీగ్‌కు పాలమూరు క్రీడాకారుడు గణేష్

- అభినందించిన రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, ఎండీసీఏ అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి


గణేష్‌ను అభినందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, ఏపీ జితేందర్‌రెడ్డి, పక్కన ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లాండ్ సెకండ్ కౌంటీ టోర్నమెంట్‌కు జిల్లా క్రీడాకారుడు గణేష్ ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్‌లోని చెల్టెన్‌హామ్‌లోని హెచ్ఆర్‌సీసీ క్లబ్‌కు 6 నెలల పాటు 20 మ్యాచ్‌లు ఆడేందుకు ఒప్పందం కుదిరింది. భోజనం, వసతి, నెలకు రూ.50వేల వేతనంతో పాటు కారు సదుపాయాలు క్లబ్ కల్పించనుంది. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలతో పాటు రంజీ టోర్నీకి ఎంపికయ్యాడు. గణేష్ ప్రతిభను గుర్తించిన అక్కడి నిర్వాహకులు టోర్నీలో ఆడేందుకు అవకాశం కల్పించారు. వెస్ట్ ఆఫ్ ఇంగ్లాండ్ ప్రీమియర్ టీ-20, డబ్ల్యూఈపీఎల్- టీ-20, నేషనల్, కంట్రీకప్ టోర్నమెంట్‌ల్లో గణేష్ ఆడనున్నాడు. డబ్ల్యూఈపీఎల్ టోర్నీని ఆడేందుకు అవకాశం రావటం పట్ల గణేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌లో జరిగే డబ్ల్యూఈపీఎల్ టోర్నీలకు వెళుతున్న గణేష్‌ను హైదరాబాద్‌లో శనివారం రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఎండీసీఏ అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు. టోర్నీలో మెరుగైన ప్రతిభచాటి జిల్లాకు, రాష్ట్రానికి మంచి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు అబిద్‌అలీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి



యాదమ్మ (ఫైల్)

నవాబ్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన యాదమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తన కుమారునితో కలిసి బైక్‌పై నుంచి వస్తూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలో అదుపు తప్పిన బైక్‌పై నుంచి జారిపడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందింది.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

గద్వాల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గద్వాల మండల పరిధిలోని చెనుగోనిపల్లి గ్రామంలో ఖాజా(19) అనే యువకుడు శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దౌలత్, ఫరిదాబీల కుమారుడు ఖాజా ఇంటర్ వరకు చదివాడు. హైదరాబాద్‌లో చిన్నపాటి ఉద్యోగం చేసేవాడు. రంజాన్ పండుగకు వచ్చి తిరిగి వెళ్లకపోవడంతో తండ్రి దౌలత్ కొడుకుపై కోపమయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన ఖాజా ఉదయం తల్లిదండ్రులు బ్యాంకు పనిపై గద్వాలకు వెళ్లగా ఎవరూ లేని సమయం చూసి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు తాడుకు వేలాడుతున్న కొడుకును చూసి ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. చేతికొచ్చిన ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదనలు అందరిని కలిచివేశాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయిన స్వరూప స్కూటీ

కొల్లాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల పరిధిలోని అంకిరావుపల్లి రహదారిలో ఉన్న బీపీడీ కళాశాల సమీపంలో తృటిలో పెను ప్రమాదం తప్పి యువతి ప్రాణాలతో బయటపడింది. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన శంకర్ గౌడ్ కుమార్తె స్వరూప కొల్లాపూర్ పట్టణంలోని మహాదేవి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నది. శనివారం కళాశాల వీడ్కోలు సమావేశం అంకిరావుపల్లి రహదారిలో ఉన్న బీపీడీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి స్కూటీపై వెళ్లిన ఆమె రోడ్డుపై ఉన్న తమ స్నేహితురాలిని కళాశాలకు తీసుకువచ్చేందుకు కళాశాల నుంచి స్కూటీతో రోడ్డుపైకి వెళ్లింది. అటుగా కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కొల్లాపూర్ ఆర్టీసీ బస్ డిపో కిందికి స్కూటీ దూసుకుపోవడంతో డ్రైవర్ వెంటనే తేరుకొని చాకచక్యంతో బ్రేక్ వేశాడు. దీంతో ప్రాణపాయం నుంచి తప్పించుకుంది. స్వరూప తలకు స్వల్ప గాయం కావడంతో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇసుక డంపులు సీజ్



భూనీడు వాగు సమీపంలో సీజ్ చేసిన ఇసుక డంపుల వద్ద పోలీసులు

కొత్తపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) :నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండల పరిధిలోని భూనీడు వాగు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయ పంట పొలాల్లో నిల్వ ఉంచిన ఇసుక డంపులను పోలీసులతో కలిసి రెవెన్యూ సిబ్బంది శనివారం సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక సుమారుగా 10 ట్రాక్టర్లు ఉండవచ్చునని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైన ఇసుక తరలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వంగూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని డిండిచింతపల్లి వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి పట్టు కొని సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాగుల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కుక్కల దాడిలో ఆవుదూడ మృతి

వంగూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనేటిపూర్‌లో శనివారం కుక్కల దాడిలో ఆవుదూడ మృతి చెందింది. పొలంలోని దొడ్డిలో కట్టేసి ఉన్న దూడపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా కరచి చంపాయని బాధిత రైతు నారాయణ తెలిపారు. గ్రామంలో ఊర కుక్కల బెడద ఎక్కువ ఉందని, కుక్కల బెడద నివారణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్దపులి ఆవును చంపిన కేసులో పరిహారం అందజేత



బాధిత రైతు జగదీష్‌కు చెక్కును అందజేస్తున్న రేంజ్ అధికారి దేవజ

మన్ననూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అభయా రణ్యా ప్రాంతంలోని అప్పాపూర్ పెంట పరిసరాల్లో రెండు నెలల క్రితం జగదీష్ అనే చెంచు రైతుకు చెందిన ఆవు మేతకు వెళ్లిన క్రమంలో పెద్దపులి దాడి చేసి చంపింది. ఈ ఘటనపై విచారణ చేసిన అటవీశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. పెద్దపులిని ఆవును చంపిన బాధిత రైతు జగదీష్‌కు వైల్డ్‌లైఫ్ ద్వారా మన్ననూరులోని రేంజ్ కార్యాలయంలో అటవీ రేంజ్ అధికారి దేవజ పరిహారం చెక్కు రూ.18వేలు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి శ్రీకాంత్, ఫల్లాయపల్లి బీట్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం

- జెన్‌కోలో అద్దె వాహనాల టెండర్లలో గోల్‌మాల్
- కొందరు కాంట్రాక్టర్లకే అందలం
- తీర్థ యాత్రలకు వాహనాలు వినియోగిస్తున్న జెన్‌కో ఇంజనీర్లు
- దరఖాస్తు చేసినా టెండర్ షెడ్యూల్ ఇవ్వని అధికారులు
- జెన్‌కోలో జరుగుతున్న అక్రమాలపై సీఎండీకి ఫిర్యాదు



ఈగలపెంటలో జెన్‌కో సీఈ కార్యాలయం

దోమలపెంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విధులు నిర్వర్తించే సీఈ మొదలుకొని డీఈల వరకు కార్లు, ఇతర కింది స్థాయి ఉద్యోగులకు రవాణా సౌకర్యం కోసం బస్సులు అద్దెకు కొనసాగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా అద్దె బస్సులు, కార్లను టెండర్ ద్వారా నియమించి వివిధ విభాగాలలో వినియోగించుకుంటారు. కొందరు ఇంజనీర్లు, అధికారులు వారికి నచ్చిన వారిని అందలమెక్కిస్తూ మిగతా కాంట్రాక్టర్లను దూరం పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీ సంవత్సరం టెండర్లు నిర్వహించేందుకు డిప్ తీసి రిజర్వేషన్ల పద్ధతిన టెండర్లు నిర్వహిస్తారు. కానీ, ఈ సంవత్సరం డిప్ పద్ధతి కాకుండా అధికారులకు నచ్చిన వారికి మాత్రమే టెండర్లలో పాల్గొనేందుకు ఒక పథకాన్ని రచించారు. దీని ప్రకారం జెన్‌కో అధికారులకు ముడుపులు ముట్ట జెప్పే కాంట్రాక్టర్లకు మాత్రం ఈ ఏడాది ఫలానా డివిజన్‌లో ఫలానా వాహనానికి సంబంధించి టెండర్లు పిలుస్తామని, అందుకు అవసరమైన వాహనం ఏర్పాటు చేసుకోవాలని ముందే సమాచారం ఇస్తారు. ముందు ఒక వాహనం కావాలని షెడ్యూల్ విడుదల చేసి, ఇతర కాంట్రాక్టర్లు అందుకు వాహనాలు సమకూర్చుకున్నాక, ముందుగా విడుదల చేసిన షెడ్యూల్‌నూ రద్దు చేస్తారు. తక్కువ గడువుతో మరో వాహనానికి టెండర్లు పిలిచి వారు అనుకున్న వ్యక్తికే టెండరు దక్కే విధంగా ప్రణాళిక రూపొందిస్తారని దోమలపెంటకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

జెన్‌కోలో ప్రతీ సంవత్సరం కావల్సిన వాహనాలు

ప్రతీ సంవత్సరం జెన్‌కో ఇంజనీర్లు, అధికారులకు, ఉద్యోగులు భూగర్భ విద్యుత్ కేంద్రంలో విధులకు హాజరయ్యేందుకు 2 బస్సులు, 14 కార్లు అవసరం కాగా ఇందుకు ఫిట్‌నెస్ కలిగిన వాహనాలు ఎంపిక చేసుకుంటారు. సీఈ 1 కారు, ఇద్దరు ఎస్‌ఈలు ఒకరు వోఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్), మరొకరు సివిల్ ఎస్‌ఈ చెరో కారు, సివిల్ ఈఈలకు 2 కార్లు, డీఈటీ 1కారు, ఎస్ఏవో 1కారు, పవర్ హౌస్ జనరల్ డివిజన్‌లో 1కారు, ఏఅండ్‌సీ 1 కారు, ఎలక్ట్రికల్ డీఈ1 కారు, మెకానికల్ డీఈ 1కారు, ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ 1కారు, వోఅండ్ఎం స్టోర్ డీఈ 1 కారు, ఎమర్జెన్సీ సర్వీస్ కొరకు మరొక కారు అవసరం మేరకు టెండర్ ద్వారా నియమించుకుంటారు.

చెల్లించే అద్దె..

సీఈ కారుకు నెలకు అద్దె రూ. 75 వేలు. తిరగాల్సిన దూరం 5000 కిలో మీటర్లు, ఇద్దరు ఎస్‌ఈల కార్లకు అద్దె రూ. 52 వేలు, 2 వేల కిలో మీటర్లు, ఎక్ట్రికల్ డీఈ కారు అద్దె రూ. 52 వేలు, కిలోమీటర్లు 2 వేలు, ఎస్‌పీఫ్ ఆర్ఐ కారు, అద్దె రూ. 52 వేలు, కిలోమీటర్లు 2వేలు, ఎమర్జెన్సీ సర్వీస్ కారు అద్దె రూ. 52 వేలు, 2 వేల కిలో మీటర్లు, ఈ వాహనాల 24 గంటలు అధికారులకు అందుబాటులో ఉంటాయి. మరో 8 కార్లు వివిధ విభాగాలలో ఉన్న అధికారులకు 12 గంటల డ్యూటీలో ఉంటాయి. ఈ వాహనాలకు నెలకు అద్దె రూ. 40 వేలు, 2వేల కిలోమీటర్లు దూరం తిరగాల్సి ఉంటుంది. కార్మికుల కోసం ఏర్పాటు చేసిన 2 బస్సులకు నెలకు అద్దె రూ. 1.45 లక్షలు, తిరగాల్సింది 2500 కిలోమీ టర్లు ఉంటుంది.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఈగలపెంట జెన్‌కో కార్యాలయం టెండర్లలో మూమూళ్లు ఇచ్చే కాంట్రాక్టర్లకే అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. సివిల్ పనులకు సంబంధించి టెండర్లు పిలువకుండానే వారికి నచ్చిన కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించి 10 శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. నాలాంటి వారిని జలగలా పట్టి పీడిస్తున్నారు. అవినీతి అధికారులపై విచారణ చేపట్టాలని జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియాకు, జెన్‌కో డైరెక్టర్లకు ఫిర్యాదు చేశాం. యాజమాన్యం, ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- ఎడ్ల శేఖర్,
జెన్‌కో కాంట్రాక్టర్, దోమలపెంట

అవసరమైన వాహనాలకు టెండర్లు పిలుస్తాం

జెన్‌కో సంస్థలో జరిగే పనులకు ఉపయోగపడే వాహనాలకు టెండర్లు పిలుస్తాం. అత్యవసర పరిస్థితులను బట్టి టెండర్ షెడ్యూల్‌ను రద్దుచేసే అధికారం మాకుంది. సంస్థ నిర్దేశించిన దూరాన్ని బట్టి వాహనాలు తిరగాల్సిందే. సొంత అవసరాలకు వాహనాలు వాడుకోవడానికి వీలులేదు. కొందరు కాంట్రాక్టర్లు చేస్తున్న తప్పుడు ఆరోపణల్లో వాస్తవం లేదు.

- ఆదినారాయణ,
జెన్‌కో సివిల్ ఎస్ఈ

తిరగాల్సిన దూరం...

సంబంధిత ఇంజనీర్లకు, అధికారులకు కేటాయించిన వాహనాలు టెండర్లలో పొందుపర్చిన ప్రభుత్వ నిబంధనల ప్రకారం తిరగాల్సిన దూరం 24 గంటలు.. ఈ వాహనాలు నెలకు 2 వేల కిలో మీటర్ల దూరం తిరగాలి. అంతకన్నా ఎక్కువ దూరం తిరిగితే కిలో మీటర్‌కు రూ. 6 లెక్కన జెన్‌కో సంస్థ చెలిస్తుంది. ఏ ఒక్క వాహనం 1300 కిలో మీటర్లకు మించి తిరగడం లేదని, కానీ ఇక్కడ మాత్రం అంతకన్నా తక్కువ దూరం వాహనాలు తిప్పి, కొందరు కాంట్రాక్టర్ల నుంచి మామూళ్లు తీసుకుని పూర్తి దూరం తిరిగినట్లు బిల్లులు చెల్లింపులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరి కొందరు ఇంజనీర్లు తీర్థయాత్రలకు, ఇతర సొంత అవసరాలకు వాహనాలను వాడుకుంటున్నారని, ప్రభుత్వ ధనం దుర్వినియోగం జరుతున్నదని, టెండర్ల అవకతవకలపైన వాహనాలు తిరిగే రీడింగ్‌పై జెన్‌కో సీఎండీ విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

- టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం



రాష్ట్ర రెండో సభలో ప్రసంగిస్తున్న టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం

నారాయణపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం వీరోచితంగా పోరాడాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేట మెట్రో గార్డెన్‌లో జరిగిన తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ అనుబంధం) రాష్ట్ర రెండవ మహాసభల్లో మాట్లాడుతూ చరిత్రలో కార్మికులు పోరాడకుండా ఏ హక్కులు సాధించలేదని అన్నారు.

కార్మికులు గత సంవత్సరంలో తమ హక్కుల కోసం సమ్మె చేస్తే సమ్మె దగ్గరికి నాటి ప్రతిపక్ష, నేటి అధికార కాంగ్రెస్ మేం అధికారంలోకి వచ్చిన మరుక్షణం మిమ్మల్ని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి రెండు అసెంబ్లీ సమావేశాలు ముగిసినా కార్మికుల గురించి మాట్లాడలేదన్నారు. ఇది మోసమే కదా అన్నారు. ధనవంతులు తినే సన్న బియాన్ని ప్రతి పేదోడికి ఇచ్చి మంచి బోజనం చేయమంటున్న సీఎం రేవంత్‌రెడి ముందు సన్నబియ్యం ఉచిత పథకాలు తమకు అవసరం లేదని, కనీస వేతనాలు అమలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయండి అని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ కార్మికుల కాళ్లు కడిగారు.. కానీ ఒకపక్క లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులకు కనీసం యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును హరించారని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితంగా పోరాడాలన్నారు. టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మేష్, అరుణ్‌కుమార్, కిరణ్, బి.నర్సిములు, కాశినాథ్, రాము, వెంకట్రాములు, సాంబశివుడు, కుర్మయ్య, గణేష్, చంద్రం, కృష్ణ, వెంకట్, ముత్తయ్య, గోపాల్‌రావు, అప్పారావు, రాందాజ్ తదితరులున్నారు. అనంతరం కార్మికుల ప్రదర్శన ర్యాలీ పురవీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా మీదుగా కొత్తబస్టాండ్, నర్సిరెడ్డి చౌరస్తా వరకు కొనసాగింది.

అన్నీ రాజకీయ పార్టీల్లో అగ్రకులాల వారే..

- యాదవ విద్యా వంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్



భూత్పూర్‌లో ఏర్పాటు చేసిన యాదవుల విద్యావేదిక సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌యాదవ్

భూత్పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడ చూసినా, ఏ పార్టీలో చూసినా రాజకీయంగా అగ్రకులాలవారే రాజ్యాధికారాన్ని ఏలుతున్నారని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ అన్నారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్లో దేవరకద్ర నియోజవర్గంలోని వివిధ మండలాలకు చెందిన యాదవ నాయకులతో యాదవ విద్యావంతులవేదిక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకులు కులగణన చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే దేశంలో ఎక్కడ లేని విధంగా కులగణన చేసిందన్నారు. దాని వల్ల బీసీలు, ఎస్సీలు, ఎస్టీల జనాభా ఎంత ఉందన్న లెక్క తేలిపోయిందన్నారు. రాష్ట్రంలో అన్నీ వర్గాల్లో బీసీల జనాభా 42 శాతం ఉందని అన్నారు. ఇంత జనాభా శాతంలో యాదవులు 30లక్షల మంది ఉన్నారని, అంటే 10శాతం ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పాలమూరు మునిసిపాలిటీ ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, యాదవ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌నర్సయ్యాయాదవ్, రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, బైకని యాదవ్, లక్ష్మీనర్సింహయాదవ్, అంజన్నయాదవ్, జుర్రు నారాయణయాదవ్, భరత్‌కుమార్, విజయ్‌మోహన్, దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకుడు బత్తుల మల్లేష్‌యాదవ్, వివిధ మండలాల నుంచి వచ్చిన యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి మంటలు



షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగుతున్న దృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో స్తంభానికి అమర్చిన ఇంటర్నెట్ తీగలకు మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది ఆర్పివేసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో హుటాహుటిన విద్యుత్ శాఖ వారు అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ శాఖ సిబ్బంది చాకచక్యంగా రాత్రివేళ కాలి పోయిన తీగలను తీసివేసి కట్ చేశారు.

వెంటనే విద్యుత్ స్పాట్ బిల్డర్ ఎండీ ఆజాం రాత్రివేళ అయినప్పటికీ ఫైర్ స్టేషన్ వాహనమెక్కి దానిపై నుంచి స్తంభాన్ని ఎక్కి చాకచక్యంగా విద్యుత్‌ను పునరుద్ధరింపజేశారు. కార్యక్రమంలో ఏఈ మాన్యనాయక్, లైన్‌మన్ ఆజాం, ఫైర్ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలిక (16) అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నది.

సెలవులు ఉండటంతో ఇంటికి వచ్చిన బాలిక శనివారం కన్పించకుండా పోవడంతో చుట్టు పక్కల బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లి ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి యువకుడికి గాయాలు

కోస్గి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి యువకుడికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కోస్గి మండలం సర్జకాన్‌పేట గ్రామానికి చెందిన మహేష్ మేకల మేత కోసం ఇంటి ముందు ఉన్న వేప చెట్టు ఎక్కి కొమ్మలు కోస్తూ ఉండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో అతడి నడుము భాగంలో, తలకు తీవ్ర గాయాలయ్యాయి.

బాధితుడిని కోస్గి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజా నజీమ్ అలీ అప్సర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలోని బీసీ, ఈబీసీ, నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజా నజీమ్ అలీ అప్సర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వర్గాల జనాభా ప్రాతిపదికన జిల్లా, మునిసిపాలిటీ, మండలాలకు యూనిట్లు కేటాయిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన జిల్లాలోని బీసీ, ఈబీసీ నిరుద్యోగ యువత నిర్దేశిత తేదీలోగా టీజీవోబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసి, హార్డు కాపీని ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

పేదల ఆకలి తీర్చేందుకే... సన్నబియ్యం పంపిణీ

- కలెక్టర్ బదావత్ సంతోష్



కీమ్యాతండాలో గిరిజనులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

బిజినేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేపట్టినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని కీమ్యాతండాలో శనివారం గిరిజనులతో కలిసి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి భోజనం చేసి మాట్లాడారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డుబియ్యం ప్రజలు తినకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవడమే కాకుండా పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత సన్న బియ్యం పథకం ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం భోజనం చేస్తూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసి సన్నబియ్యంతో వండిన అన్నం ఎలా ఉందని గిరిజన మహిళలను అడగ్గా చాలా బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి సామ యాదయ్య, కాంగ్రెస్ నాయకులు హరీష్‌రెడ్డి, రామచందర్ నాయక్, హర్యానాయక్, మార్కెట్ డైరెక్టర్ వాల్యానాయక్, మాన్యనాయక్, మండల అధ్యక్షుడు మిద్దె రాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు గంగ నమోని తిరుపతయ్య, అమృత్‌రెడ్డి, కూచకుళ్ల వెంకట్ రెడ్డి, వెంకటస్వామి, అమర్‌నాయక్, వీరేందర్ ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

మక్తల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల శివారులో కొంత మంది పేకాట ఆడుతున్నారనే పక్క సమాచారంతో టాస్క్‌ఫోర్స్, ఊట్కూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఊట్కూర్ ఎస్సై కృష్ణంరాజు తెలిపారు.

పేకాట రాయుళ్ల నుంచి రూ.7,700 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించి గేమింగ్‌యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు బీజేపీ ఆవిర్భావ వేడుకలు

మిడ్జిల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్ శనివారం తెలిపారు. పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

రాజాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగారెడ్డిగూడలో ఎంపీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు ఆనంద్ ప్రారంభించారు.

లయన్స్ క్లబ్ కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ కమిటీని శనివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుదర్శన్‌యాదవ్, కార్యదర్శిగా చిన్నయ్య, కోశాధికారిగా నాగరాజు ఎన్నికయ్యారు.

'చర్యలు తీసుకోవాలి'

మిడ్జిల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుందుభీ వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న తాటిచెట్లను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శనివారం మిడ్జిల్‌కు గౌడ సంఘం నాయకులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

జడ్చర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో బాదేపల్లి పాతబస్టాండు, రైల్వే స్టేషన్ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు ప్రారంభించారు.

ముత్యాల తలంబ్రాలు అందజేత

చిన్నచింతకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం జరుగనున్న సీతారాముల కల్యాణానికిలో ముత్యాల తలంబ్రాలను తమ ఇంటి ఇవ్వటం ఆనవాయితీ. ఈ క్రమంలో బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, తనయుడు సిద్దార్థరెడ్డి, అల్లుడు జగదభిరామిరెడ్డితో కలిసి శనివారం మండలంలోని పర్కాపూర్‌లో ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు.

రామాయణంపై విద్యార్థులకు పరీక్ష

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ సంస్కరణ శిక్షణ విభాగం వీహెచ్‌పీ పాలమూరు ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు రామాయణంపై పరీక్ష నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ చిన్నారులకు రామాయణంపై అవగాహన కల్పించేందుకే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, కోశాధికారి శ్రీధర్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కన్వీనర్ గోపిచంద్‌రెడ్డి, ప్రాణేష్, హరిప్రకాష్, విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

సీతాదయాకర్‌రెడ్డికి అభినందనల వెల్లువ

చిన్నచింతకుంట/మహబూబ్‌నగర్ టౌన్/మూసాపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్‌గా కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టగా, శనివారం మండలంలోని పర్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ సీతాదయాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి అభినందించారు. నాయకులు జగదభిరామిరెడ్డి, జైపాల్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్దన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా టీడీపీ మహబూబ్‌నగర్ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఆర్.బాలప్ప, మాల్యాద్రిరెడ్డి సన్మానించారు. మూసాపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ సన్మానించారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

పాలమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ 12వ జిల్లా ముగింపు మహా సభల్లో ఆయన ప్రసంగించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీని గద్దె దించాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బిక్షపతి యాదవ్, పి.సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శగా ఆంజనేయులు, కోశాధికారిగా మధుసూదన్‌రెడ్డి, అమరజ్యోతి, చెన్నయ్య, రంగన్న, పద్మ, మొగులన్న, దేవానంద, జే.నరసింహా, యాదయ్య, నరసింహ, గోపాల్‌నాయక్, సాయిప్రకాష్, శ్రీనివాసులు, రాములు, హరి ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌లో బీసీల స్థానం ఎక్కడ?

పాలమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో బీసీల స్థానం ఎక్కడ ఉందని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పోస్టుల విషయంలో బీసీలకు ఏ మాత్రం స్థానం లభించకపోవటం దారుణం అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు చిన్నారెడ్డి, శివసేనారెడ్డి, బాలకృష్ణారెడ్డి, సుంకిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కెవీఎన్‌రెడ్డి, ఏపీ జితేందర్‌రెడ్డి, జగదీశ్వరరావు, గుర్నాథ్‌రెడ్డి, నిన్ననే సీతాదయాకర్‌రెడ్డి నిర్వహించారు. ఇంకా మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, ఈ రోజు తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏపీ మిథున్‌రెడ్డి ఎంపికవడం కొసమెరుపు అన్నారు.

అభివృద్ధిలో చెరగని ముద్ర

» అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు » కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రాం జయంతి



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు



బాబు జగ్జీవన్‌రాంకు నివాళి అర్పిస్తున్న టీఎన్‌జీవోస్ ప్రతినిధులు, డాక్టర్స్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాబు జగ్జీవన్‌రాం దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు అన్నారు. జాతీయ ఉద్యమంలో పాల్గొన్న ఆయన స్వాతంత్ర్యం అనంతరం కేంద్ర మంత్రిగా ఎన్నో సంస్కరణలు తెచ్చి దేశాభివృద్ధికి కృషి చేశారన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జగ్జీవన్‌రాం జయంతికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి శంకర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త

బాబు జగ్జీవన్‌రాం గొప్ప సంఘ సంస్కర్త అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ చౌరస్తాలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

నేటికీ గ్రామాల్లో కులవివక్షత

పాలమూరు : నేటికీ గ్రామాల్లో కులవివక్షత, అంటరానితనం కొనసాగటం బాధాకరమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యం రాజు, కుర్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. అదే విధంగా టీఎన్‌జీవోస్, ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, గజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళి అర్పించారు.

● హన్వాడ : హన్వాడలో బుద్ద ఆరామ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జగ్గీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● రాజాపూర్ : మండల పరిషత్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి అధికారులు పూలమాల వేసి నివాళి అర్పించారు.



నివాళి అర్పిస్తున్న ఎస్పీ జానకి

● జడ్చర్ల : జగ్జీవన్‌రాం జయంతిని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, రఘురాంగౌడ్, బుక్క మహేష్, బీఆర్ఎస్ నాయకులు ఇంతియాజ్‌ఖాన్, రఘుపతిరెడ్డి, శ్రీను, కృష్ణారెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్, బీఎస్పీ నాయకుడు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్ర పటానికి నివాళి అర్పించారు.

● చిన్నచింతకుంట : మండలంలోని దమగ్నాపూర్‌లో జగ్గీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే జీఎంఆర్ పూలమాల వేసి, నివాళి అర్పించారు.



నివాళి అర్పిస్తున్న గజిటెడ్ సంఘం నాయకులు

● మహబూబ్‌నగర్ టౌన్ : తెలంగాణ చౌరస్తాలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి టీడీపీ నాయకులు బాలప్ప, చంద్రశేఖర్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మిడ్జిల్ : అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు బుచ్చయ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● బాలానగర్ : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● నవాబ్‌పేట : కాంగ్రెస్ నాయకుడు హమీద్ మహేక్ ఆధ్వర్యంలో మండలంలోని యన్మనగండ్ల గ్రామ పంచాయతీ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మహబూబ్‌నగర్ : జోగులాంబ గద్వాల డీఐజీ కార్యాలయ ఆవరణలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎస్పీ జానకి పూలమాల వేసి నివాళి అర్పించారు. అడిషినల్ ఎస్పీ రాములు, ఏఆర్ అడిషినల్ ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ రమణారెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, రవి పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ విద్యావిభాగం : మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు అన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ భవన్‌లో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మహబూబ్‌నగర్ అర్బన్ : జిల్లా క్రీడాశాఖ కార్యాలయంలో విజయకుమార్ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎదిర 4వ వార్డు, దివిటిపల్లిలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళి అర్పించారు. హనుమాన్ యోగా, కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళి అర్పించారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

» కలెక్టర్, ఎస్పీలకు రెవెన్యూ అసోసియేషన్ ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా విషయంలో రెవెన్యూ అధికారులపై పరుషపదజాలంతో దూషించిన ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధికారులు కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకికి ఫిర్యాదు చేశారు. మూసాపేట మండలం నిజాలపూర్‌లో ఉపాధి హామీ సీసీ రోడ్లకు అనుమతులకు మించి ఇసుక తరలిస్తుండటంతో అక్కడికెళ్లిన రికార్డ్ అసిస్టెంట్‌పై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ ఫోన్‌లో అతని దూషించడమే కాకుండా తహసీల్దార్‌పైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. నౌకరి చేయాలంటే చూసీ చూడనట్లు ఉండాలని, లేదంటే నీతోపాటు ఎమ్మార్వోను తంతానని బూతుపురాణం చేయడం, ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రెవెన్యూ అసోసియేషన్ నాయకులు స్పందించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు, ఎస్పీతోపాటు భూత్పూర్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సీసీ రోడ్ల కోసం 10 ట్రాక్టర్ ట్రిప్పులను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరలించాలని తహసీల్దార్ అనుమతి ఇవ్వగా.. లెక్కకు మించి ఇసుక తరలిస్తుండటంతో అడిగిన అధికారులపై ఇష్టానుసారంగా నోరు పారేసుకోవడంతో అధికారులు స్పందించారు. రెవెన్యూ అసోసియేషన్‌నాయకులు ఘన్సీరాం, రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్, దేవేందర్, చంద్రా యుడు పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటించాలి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ నురూల్‌నజీబ్

భూత్పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా స్వచ్ఛత పాటించాలని.. పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వేసవి క్యాంపులో భాగంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ - పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మానవహారం చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ నురూల్‌నజీబ్ మాట్లాడుతూ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలను నడిపిస్తున్నరని వారు తప్పనిసరిగా ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ ఆర్ఐ నరసింహ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సుభాషిణి, స్వరూప, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు కాంగ్రెస్‌కు వత్తాసు పలకొద్దు'

మూసాపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజాపాలనలో అధికారులు కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ కొమ్ముకాయడం తగదని, నిజాయితీగా పనిచేస్తే మీకు బీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ అన్నారు. శనివారం మూసాపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు లక్ష్మినర్సింహాయాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సీసీరోడ్డు నిర్మాణాల పేరిట ఇసుక మాఫీయా ఇసుకను అక్రమంగా తరలిస్తోందని, దీన్ని ప్రశ్నించిన అధికారులను కాంగ్రెస్ మండల నాయకుడు అసభ్య పదజాలంతో దూషిండం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, దోపిడీలకు పాల్పడుతున్నా.. అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. నాయకులు రవీందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్, తిరుపతిరెడ్డి, రవివర్థన్, యాదయ్య, రవి కుమార్, చంద్రయ్యగౌడ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఎక్కుతూ ప్రమాదానికి గురైన మహిళ

మహమ్మదాబాద్ ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నంచర్ల గేట్ దగ్గర తాండూరు డిపో బస్సు ఎక్కుతున్న మహిళ కాలు జారీ కింద పడి గాయాలపాలైన శనివారం చోటు చేసుకుంది. జూలపల్లికి చెందిన సత్యమ్మ బస్సు ఎక్కబోయి కాలు జారీ కిందపడటంతో గాయాలుకాగా, చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు శ్రీరామ నవమి

» వేడుకలకు సిద్ధమైన ఆలయాలు



ముస్తాబైన టీచర్స్ కాలనీలోని రామాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రాములోరి కల్యాణానికి సీతారాముల ఆలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం పంచామృతాభిషేకం అనంతరం మధ్యాహ్నం అభిజిత్ శుభలగ్నంలో సీతారాముల కల్యాణం కనుల పండుగగా నిర్వహిస్తారు. ఈ వేడుకలకు పట్టణంలో ప్రధానంగా రాంమందిర్ అభయ ఆంజనేయస్వామి ఆలయం, టీచర్స్ కాలనీలోని రామాలయంలో నిర్వహించే కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. బ్రహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వ రి ఆలయం, వాసవీ మహిళ మందిరంలో, వీరన్నపేటలోని అభయాంజనేయ స్వామి ఆలయం, వేంకటేశ్వర కాలనీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, బంమీదిపల్లి ఆంజనేయ స్వామి ఆలయాలను ఆలయ కమిటీలు, భజనమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

● మూసాపేట : మండలకేంద్రంతో పాటు నిజాలాపూర్, జానంపేట, పోల్కంపల్లి, చక్రాపూర్, వేముల, దాసరిపల్లి, నందిపేట, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి ఆలయాలను ముస్తాబు చేశారు.

● పాలమూరు : వాల్మీకీ రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు రామలక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దు

» ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వాటర్‌మెన్‌లను విధుల నుంచి తొలగించడానికి వెనకాడబోమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. మిషన్ భగీరథ వాటర్‌మెన్‌ల పనితీరుపై ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని, గతంలో సైతం హెచ్చరికలు చేసినా వాటర్‌మెన్‌ల వైఖరిలో మార్పు వచ్చినట్లు లేదంటూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతమంది వాటర్‌మెన్‌లు సకాలంలో నీటిని సరఫరా చేయకపోవడంతో పలు గ్రామాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతంలో ప్రజలకు తక్కువగా నీటిని సరఫరా చేసి, పరిశ్రమలకు నీటిని సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. నియోజకవర్గంలోని బాలానగర్, జడ్చర్ల మండలాలలో వాటర్‌మెన్‌లపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటర్‌మెన్‌ల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన పరిస్థితులు ఉంటే జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

చౌకధరల దుకాణాలకు దరఖాస్తులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న ఆరు చౌకధర దుకాణాల డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో నవీన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హన్వాడ మండలం గుండ్యాల చౌకధర దుకాణం (బీసీ-ఇ), చిన్న దర్పల్లి (బీసీ-ఇ), కొకుంట్ల మండలం అప్పంపల్లి (బీసీ), మహబూబ్‌నగర్ రూరల్ మండలం అస్లాంఖాన్ స్ట్రీట్ (ఓసీ), ఫతేపూర్ (ఎస్టీ), మిడ్జిల్ మండలం సింగందొడ్డి (ఓసీ) ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యావంతులైన నిరుద్యోగులు 18 నుంచి 40 సంవత్సరాల వారు అర్హులన్నారు. ఈనెల 26లోపు సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



మత పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. ఇరుమతాల పండగలను, సంప్రదాయాలను ఒకరినొకరు గౌరవించుకుంటూ మత సామరస్యాన్ని పెంపొందించాలని కోరారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఇరువర్గాల మతపెద్దలతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రంజాన్, ఉగాది పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకున్నామని ఇదే సాంప్రదాయాన్ని ఇక ముందు కొనసాగించాలని కోరారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, మత పెద్దలు గోపాల్‌యాదవ్, మెట్టుకాడి శ్రీనివాస్, అంజయ్య, మద్దియాదిరెడ్డి, పాండురంగం, రఫిక్‌పటేల్, మోసిన్‌ఖాన్, షబ్బీర్‌అలీ, అంజద్ పాల్గొన్నారు.

ఘనంగా గెలాక్సి పాఠశాల వార్షికోత్సవం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో గల గెలాక్సీ పాఠశాల 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భానుప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

14 నుంచి సాయిబాబా వార్షికోత్సవాలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న గణేష్‌నగర్‌లోని సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవాలను ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పద్మజ గోపాల్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఉదయం సాయిబాబా అభిషేకంతో ప్రారంభమై, 16న సాయంత్రం పల్లకీసేవతో ముగుస్తాయని తెలిపారు.

ధ్యానంపై అవగాహన

మూసాపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, రామకృష్ణ మిషన్ వారి ఆధ్వర్యంలో ధ్యానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన గురువులు ప్రజలకు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.. అంతకుముందు ప్రజలచే యోగాసానాలు చేయించారు. కార్యక్రమంలో నిర్వహకులు రాఘవేందర్, దీర్ఘాయువు, నాయకులు శెట్టి చంద్రశేఖర్, గడ్డం మహేందర్, శ్రీనివాస్‌శర్మ, కావలి నారాయణ, తిరుపతయ్య, శరత్‌గౌడ్, విజయకుమార్ పాల్గొన్నారు

కొనసాగిన పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ

హన్వాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగన్నపల్లి, ఎర్రగట్టుతండా, కిష్టంపల్లిగేట్‌తండా గ్రామాల్లో శనివారం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తు ప్రభుత్వ పథకాలను వివరించారు. నాయకులు కృష్ణయ్య, నవనీత, గంగిరెడ్డి, యాదవరెడ్డి, చెన్నయ్య, రామకృష్ణ, నర్సిములు, శ్రీను పాల్గొన్నారు.

● మూసాపేట : మండలంలోని సంకలమద్ది, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదపు కార్యక్రమంలో భాగంగా మండల కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమం మండలంలోని మొకర్లబాద్, జూలపల్లి, దేశాయపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరి పీఈటీ రాములు పాల్గొన్నారు.

శంకరయ్య సేవలు మరువలేనివి



కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న యూటీఎఫ్ కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సామాజిక ఉద్యమకారుడు, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అడిట్ కమిటీ సభ్యుడు శంకరయ్య సేవలు మరువలేనివని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జంగయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన శంకర్య సంస్మరణ సభకు ఆయన హాజరై శంకరయ్య సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సంక్షేమ నిధి నుంచి రూ.6 లక్షల చెక్కును రాష్ట్ర కార్యదర్శి జీవీ నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కిష్టయ్య, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, నాయకులు భాస్కర్, నర్సింహులు, అజయ్, మన్యం, వేణుగోపాల్, హేమంత్‌కుమార్, కిష్యానాయక్ వెంకటయ్య పాల్గొన్నారు.

పేదలందరికీ సన్న బియ్యం

మహమ్మదాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ సన్న బియ్యం అందిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ అన్నారు. శనివారం మండలంలోని గాధిర్యాల్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా, కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు బాలముకుందం తదితరులు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : మండలంలోని దేపల్లిలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాములు ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. నాయకులు డీలర్ నారాయణ, శివరాములు, రవి యాదవ్, అశోక్, వెంకటేష్, యాదయ్య, అశోక్ అలీ, భాస్కర్ పాల్గొన్నారు.